క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ



రాంనగర్‌లో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు రాంనగర్‌లో రూ.60లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శనివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేశారు. అనంతరం వార్డులో తిరిగి కాలనీ ప్రజలతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ అంకం నరేశ్, ప్రకాశ్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

నస్పూర్: పెరిగిన జనాభాకు అనుగుణంగా పట్టణాభివృద్ధికి చేపట్టిన పనులకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్, మున్సిపల్ ఏఈ మధు, టౌన్ ప్లానింగ్ అధికారి సతీష్‌తో కలిసి శనివారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేయాల్సిన జంక్షన్‌లపై స్థల పరిశీలన చేశారు. శ్రీరాంపూర్ బస్టాండ్, సీసీసీ కార్నర్, కలెక్టరేట్ చౌరస్తా వద్ద మూడు జంక్షన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో జంక్షన్‌కి రూ.కోటి పట్టణప్రగతి నిధులు కేటాయించినట్లు వివరించారు. జంక్షన్‌ల విస్తరణకు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

లక్సెట్టిపేట: పట్టణ మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ కొత్తపల్లికి బదిలీ అయినట్లు శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడికి రావాల్సిన మున్సిపల్ కమిషనర్ వివరాలను ఇంకా వెల్లడించలేదు.

ఐటీడీఏ పీవోకు వినతి

పాతమంచిర్యాల: ఆదివాసీ తోటి కులస్తులకు పక్కా ఇళ్లు లేవని, సీడీపీ నిధులతో ఇళ్లు నిర్మించాలని, తోటి కులస్తులలో చాలా మంది మూత్రపిండాల వ్యాధి, క్యాన్సర్‌తో మరణిస్తున్నారని ప్రతీ కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్సు చేయించాలని ఆదివాసీ తోటిసేవా సంఘం నాయకులు శనివారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ తోటిసేవా సంఘం జిల్లా అధ్యక్షుడు వల్క చిలుకయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కహెకషా బాను సంతూర్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. విద్యార్థినికి ఏడాదికి రూ.24వేల చొప్పున, మూడేళ్లకు రూ.72వేలు అందుతాయని ఆమె పేర్కొన్నారు. కళాశాలలో శనివారం విద్యార్థినిని అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భట్టి

జన్నారం: ఏఐసీసీ రిసర్చ్ డిపార్టుమెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ నాయక్ ఆధ్వర్యంలో ఖానాపూర్ నియోజకవర్గంలోని ఐదు మండలాల స్థాయిలో నిర్వహించే ఇందిరమ్మ క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను శనివారం హైదరబాద్‌లో కాంగ్రెస్ సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఇందిరమ్మ పేరుతో నిర్వహించే ఈ పోటీలు, విద్యార్థులకు సదావకాశం అని వినోద్‌నాయక్ పేర్కొన్నారు. మండలాల వారిగా నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రూ.2లక్షల వరకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

గోరింట సంబురం





దండేపల్లిలో...

దండేపల్లి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని దండేపల్లి కస్తూరిబా గాంధీ విద్యాలయంలో శనివారం గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు గోరింటాకు పెట్టుకుని, ప్రదర్శనగా కూర్చున్నారు. అంతకుముందు పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించారు. ప్రకృతి, తెలంగాణ పండగల గురించి ఎస్వో మంజుల విద్యార్థులకు వివరించారు.

మందమర్రిరూరల్: ఆషాఢ మాసం సందర్భంగా మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు వేడుకను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం మోహన్‌రెడ్డి సతీమణి యశోద హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియాలోని సేవా సమితి సభ్యులు ఉన్నారు.

పాఠశాలల్లో ముందస్తు బోనాలు



జన్నారం: బోనాలతో చిన్నారులు



జిల్లాలో విద్యార్థినుల కోలాట, నృత్య ప్రదర్శనలు



రామకృష్ణాపూర్: గద్దెరాగిడిలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజు, బోనా లమ్మ వేషాధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బోనాల పండగ ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్, అయూబ్, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: స్థానిక రివిలేషన్ పాఠశాలల్లో శనివారం ఆషాఢ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కోలాట నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్‌రావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: ప్రభుత్వం బోనాలను ఘనంగా నిర్వహిస్తున్నందునా జన్నారం మండలంలో పలు పాఠశాలల్లో ముందస్తు బోనాల పండుగ నిర్వహించారు. రాఘవేంద్ర లిటిల్‌హాన్స్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎల్లమ్మ తల్లి, పోతరాజుల వేషాధారణతో ఆకట్టుకున్నారు. కలమడుగు వివేకానంద పాఠశాలలో బోనాల ప్రాముఖ్యత తెలిపారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు చేస్తున్న జాన్సన్‌నాయక్

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో శనివారం దుర్గాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కనుల పండువగా నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య అమ్మవారు కొలువుదీరారు. అనంతరం బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు బుక్య జాన్సన్‌నాయక్, సర్పంచ్ జాడి గంగాధర్, ఎంపీటీసీ వెంకటస్వామి, వార్డు సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు.

కిరీటం బహూకరణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మండలం కన్నాలలోని శ్రీ బుగ్గ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలోని శివలింగానికి శనివారం ఇరువురు దాతలు నాగశేష శంకర రూప కిరీటాన్ని బహూకరించారు. బెల్లంపల్లికి చెందిన చిదిరాల భావనరుషి, అనిత దంపతులు శ్రీబుగ్గ ఆలయ చైర్మన్ మాసాడి శ్రీదేవి చేతుల మీదుగా కిరీటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సంతోష్‌కుమార్, గోపి వెంకటస్వామి, ఆలయ పూజారులు వేణుగోపాల శర్మ, సంతోష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాత పీఠం ప్రతిష్ఠ

నెన్నెల: మండల కేంద్రంలోని గంగాధర దేవాలయంలో శనివారం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీమాత పీఠాన్ని ప్రతిష్ఠించి ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళ హారతులతో ఎదుర్కొని, భాజాభజంత్రీలతో గంగాధర దేవాలయానికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అమ్మవారికి ఐదు రోజుల పాటు నిత్యపూజలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా మంగళ హారతులతో భజన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆర్యవైశ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఘనంగా మడేలయ్య బోనాలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో మడేలయ్య బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. బోనాలతో శోభాయాత్ర నిర్వహించి, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, కౌన్సిలర్లు, రజక సంఘం నాయకులు మహిళలు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డు హైటెక్‌సిటీ కాలనీలో మున్సిపల్ క్రీడాప్రాంగణంతో పాటు, పిల్లల పార్కులో రూ.1.30కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలోని పనులతో పాటు, పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన అన్ని రకాల పరికరాలను త్వరగా అమర్చి, పచ్చదనం కోసం మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కస్మంతరెడ్డి చైతన్యరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ మధుకర్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ సునిల్, వార్డు నాయకులు సత్యపాల్ రెడ్డి, హన్మంతరావు, తోట తిరుపతి, పురెల్ల పోచమల్లు, బాలరాజు, తిరుపతి రెడ్డి, శ్రీనివాసరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

'బాధిత కుటుంబానికి బాసటగా ఉంటా'



మాట్లాడుతున్న మాజీ మంత్రి వినోద్

బెల్లంపల్లి: విద్యుత్ షాక్‌తో మరణించిన బెల్లంపల్లి మండలం బుధాకుర్థు గ్రామానికి చెందిన రాసకొండ ప్రశాంత్ కుటుంబానికి బాసటగా నిలుస్తానని రాష్ట్ర మాజీ మంత్రి గడ్డం వినోద్ భరోసానిచ్చారు. బుధాకుర్థు గ్రామానికి వెళ్లి శనివారం బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కొంతమొత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంతకుముందు ఐఐటీలో సీటు సాధించిన తాళ్ల గురిజాల గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని మాజీ మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించి ఆర్థిక వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కారుకూరి రాంచందర్, సింగతి సత్యనారాయణ, బత్తుల రవి, ఈసా, హరీష్, గాలి శ్రీనివాస్, బానయ్య, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



హాజీపూర్‌లో వంటావార్పులో కార్మికులు

బెల్లంపల్లి/మందమర్రిరూరల్/లక్సెట్టిపేట/దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/భీమిని/వేమనపల్లి/తాండూర్: జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతుంది. సమస్యలు పరిష్కరించాలని శనివారం హాజీపూర్‌లో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. దండేపల్లిలో మండలంలోని మేదరిపేటలో జీపీ కార్మికులు భిక్షాటన చేసి, వినూత్న నిరసన తెలపగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ సంపూర్ణ మద్దతు తెలిపి రూ.5,116 అందజేశారు. జీపీ కార్మికుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి, తాండూర్‌లో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు రాష్ట్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం వినోద్ సంఘీభావం ప్రకటించారు. లక్సెట్టిపేటలో సమ్మెకు మండలంలోని ఐఎఫ్ టీయూ నాయకులు మద్దతు తెలిపారు. మందమర్రిలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి దుర్గరాజ్, సీపీఐ, ఎమ్మార్పీఎస్ నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో పంచాయతీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా కన్నెపల్లి మండలంలోని ఉపసర్పంచ్‌లు మద్దతు తెలిపి నిరవధిక సమ్మెలో కూర్చున్నారు. వేమనపల్లిలో డప్పుచప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు.

బొగ్గుబాయి వార్తలు

ఏరియా ఆసుపత్రిని సూపర్‌స్పెషాలిటీగా మార్చాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలని టీఎస్టీయూసీ సింగరేణి విభాగం ప్రధాన కార్యదర్శి టి.మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రి అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఏరియా ఆసుపత్రిలో కార్మికులకు, కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్టీయూసీ నాయకులు రాములు, హసన్, మల్లయ్య, శంకరయ్య, కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'సహకారం అందించేందుకు సిద్ధం'

కాసిపేట: ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని హాజరుశాతం పెంచడంలో యాజమాన్యం సహకరించేందుకు సిద్ధంగా ఉందని కాసిపేట 2గని మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గనిపై 100మస్టర్లు పూర్తిచేయని సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లకు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, సంక్షేమాధికారి భార్గవ్, పిట్ ఇంజనీర్ రఘు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: కార్మికుల సమస్యల సాధనకు ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించే కార్మికగర్జన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం కార్మిక గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎండి షరీఫ్, ఈశ్వర్, ప్రభాకర్, భూపతి, రాజలింగు, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

'స్వచ్ఛమైన తాగునీరు అందించాలి'

నస్పూర్: ఏరియాలోని కార్మిక వాడలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు అన్నయ్య, మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధులు రవీందర్‌రెడ్డి జీఎం సంజీవరెడ్డిని కోరినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజులుగా కార్మిక వాడలకు ఫిల్టర్ కాని నీరు సరఫరా అవుతుందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీఎం తెలిపినట్లు పేర్కొన్నారు.

ఏఐటీయూసీ ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: ఏఐటీయూసీ ఆర్కే 5బి గని ఫిట్ కమిటీని యూనియన్ కేంద్ర కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి కొట్టే కిషన్ రావు ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. ఫిట్ కమిటీ ఉపాధ్యక్షులుగా కుక్కల కిష్టయ్య, ఫిట్ సెక్రటరీగా కత్ర విశ్వనాథరెడ్డి, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ ధర్మయ్య, షిఫ్ట్ ఇన్చార్జిలుగా చంద్రమౌళి, ఎడపాక లక్ష్మణ్, నాగరాజు, విజయ్ కుమార్, ఆకుల శ్రీనివాస్, కోశాధికారిగా సీహెచ్ శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

కార్మికవాడల్లో విద్యుత్ పునరుద్ధరణ

బెల్లంపల్లి: వర్షానికి విద్యుత్ తీగలు తెగిపడి బెల్లంపల్లి సింగరేణి కార్మిక వాడల్లో గంటలుగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాకు మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి మందమర్రి–శాంతిఖని గని మధ్య ఉన్న పాత బెల్లంపల్లి శివారు ప్రాంతంలోని ఎర్ర చందనం తోట వద్ద కరెంట్ తీగలు తెగి కింద పడ్డాయి. దాదాపు 16గంటల పాటు కరెంట్ సరఫరా నిలిచిపోయి కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్మిక వాడల్లో సింగరేణి విద్యుత్ సరఫరా లేక పడుతున్న ఇబ్బందులను పలువురు జీఎం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన సింగరేణి ఎలక్ట్రికల్ విభాగం అధికారులతో మాట్లాడి కరెంట్ పున:రుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వయంగా ఘటనాస్థలికి వెళ్లి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించి కరెంట్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

కాసిపేట గని సందర్శన

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిని శనివారం అండర్‌గ్రౌండ్ మైన్స్ జీఎం సీహెచ్ జగన్‌మోహన్‌రావు సందర్శించారు. గనిలో అండర్‌గ్రౌండ్ మైన్‌కు అవసరమైన మెటీరియల్, ఎస్‌డీయల్ యంత్రాల పనితీరు, ఇతర సామగ్రి విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఉత్పత్తిలో కీలకమైన వాటిని సమకూర్చడంలో సంస్థ ముందుంటుందని, అధికారులు సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ ఉత్పత్తి సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్, అధికారులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

'ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట'



వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్కే 8 డిస్పెన్సరీలో రూ.1.6లక్షలతో ఏర్పాటు చేసిన హెచ్‌బీఏ1సీ అనలైజర్ వైద్య పరికరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం డిస్పెన్సరీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం రఘు కుమార్, ఏజీయం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, శివరావు, డెప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, వైద్యులు మురళీధర్, వేదవ్యాస్, స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

శ్రీరాంపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఆర్కే 8 కాలనీ, అరుణక్కనగర్, వాటర్ ట్యాంక్ ఏరియా, సీసీసీ, సుందరయ్యనగర్‌లలోని అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు శ్రీరాంపూర్ గాంధీనగర్‌లోని ఆశా వర్కర్ల సబ్ సెంటర్‌లో పుస్కూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కుర్చీలు పంపిణీ చేశారు.

వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

జైపూర్: వాహనదారులు వాటికి సంబంధించిన ధ్రువ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని జైపూర్ ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మంచిర్యాల, చెన్నూర్ 63 నెంబర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ధృవీకరణ పత్రాలు సరిగా లేని 17ద్విచక్రవాహనాలు, 7ఆటోలు, ఒక కారును, ఒక ఆటో ట్రాలీని సీజ్ చేసినట్లుగా తెలిపారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

దండేపల్లి: మండలంలోని ద్వారక, మామిడిపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వెరబెల్లి ఫౌండేషన్ ద్వారా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ స్కూల్‌బ్యాగ్స్, నోట్‌బుక్స్, జామెంటరీ బాక్సులను శనివారం అందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో 6, 7, 8, 9, 10తరగతుల్లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. ఈ నెల 18లోగా పాఠశాలలో సమర్పించాలని, 19న మోడల్‌స్కూల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

ర్యాగింగ్‌పై అవగాహన

రామకృష్ణాపూర్: పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో శనివారం ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా డిఫెన్స్ కౌన్సిల్ ఛీఫ్ ఎండీ.సంధాని, మెంబర్ రాములు, పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

18న ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో 18వ తేదీ ఉదయం 10గంటలకు 2వ విడత సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్) ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా కార్యవర్గసభ్యుల ఎన్నిక

పాతమంచిర్యాల: జాతీయ మాలమహానాడు జిల్లా కార్యవర్గసభ్యులను జాతీయ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా జనరల్ సెక్రెటరీగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

దండేపల్లి: మండలకేంద్రంలో గడపగడపకు బీఆర్‌ఎస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

జన్నారం: సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ, తెలంగాణలో గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు భుక్య జాన్సన్ నాయక్ కోరారు. మండలంలోని సింగరాయిపేట, రాంపూర్ గ్రామాల్లో శనివారం పర్యటించారు.

సేవచేస్తా.. ఆదరించండి

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్‌లో చేరానని, అధిష్ఠానం టికెట్ ఇస్తే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రజలు ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్ స్టేట్ వైస్ చైర్మన్ దాసారపు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఐఎన్టీయూసీ ఆఫీస్ వద్ద శనివారం మాట్లాడారు.

జై భీం కథల పుస్తకాలు పంపిణీ

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గురించి తెలిపే జై భీం కథల పుస్తకాలను పంపిణీ చేశారు.

పాఠశాలల్లో పోషకుల సమావేశం

మంచిర్యాలఅర్బన్/జన్నారం: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, జన్నారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పోషకు ల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల అభిరుచులు, వేసవి సెలవుల్లో గడిపిన విధానం, ఆహారపు అలవాట్లు, విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సూచనలు చేశారు.

కార్మికుల మండల కమిటీ ఏర్పాటు

తాండూర్: గ్రామపంచాయతీ కార్మికుల తాండూర్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎస్‌కే అంజద్, ఉపాధ్యక్షుడిగా సంగెం లక్ష్మణ్, మండల ఇన్‌చార్జిగా భరత్, కోశాధికారిగా కిషన్‌ను ఎన్నుకున్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రంలో ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం టౌన్–2 ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ జాన్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు లైన్ షిఫ్టింగ్ బెల్లంపల్లి చౌరస్తా, హనుమాన్‌నగర్, గౌతమినగర్, ఇస్లాంపూర, రాళ్లపేట, లక్ష్మినగర్, మారుతినగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొబైల్ అప్పగింత



మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలం టీకానపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు శైలజరాణి ఈ నెల 4న తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ శనివారం అందజేశారు. పాఠశాలలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో మార్గమధ్యంలో ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఫోన్ చోరీ చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రికవరీ చేసినట్లు తెలిపారు.

విరాళం అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన మిర్యాల కిషన్ కుమారుడు ఎన్నారై మిర్యాల వినోద్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు రూ.లక్షా యాభై వేలు విరాళంగా అందించినట్లు స్థానిక సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలు వినియోగించుకోవాలన్నారు.